సాక్షి పెద్దపల్లి

శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023



సైన్స్ ఎగ్జిబిషన్ సందర్శన

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రి డిగ్రీ, పీజీ కాలేజీ విద్యార్థులు గురువారం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కాలేజీలో జీన్ హెల్త్ కనెక్ట్ మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో పలు అంశాలపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



బతుకమ్మ సంబరాలు

గోదావరిఖని: స్థానిక బంగ్లాస్ ఏరియా లేడీస్ క్లబ్ సభ్యులు గురువారం ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. సింగరేణి డైరెక్టర్ సతీమణి కళ్యాణిశ్రీనివాస్, సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
34.0 /23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొడి వాతావరణం ఏర్పడుతుంది. వర్షం కురిసే అవకాశం తక్కువగా ఉంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి అర్జున్

పెద్దపల్లిరూరల్: సమాజంలోని ప్రతి ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి అర్జున్ అన్నారు. పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌లో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రతీ పౌరుడు తన హక్కులను కాపాడుకుంటూనే బాధ్యతగా మెలగాలన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శంకర్, న్యాయవాదులు హన్మాన్‌సింగ్, నరేశ్, శ్రీధర్, రమేశ్, శంకర్, ఎంపీటీసీ మిట్టపల్లి వసంత పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన డీసీపీ



డీసీపీకి మొక్క అందజేస్తున్న ప్రిన్సిపాల్

రామగిరి(మంథని): ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 30న జేఎన్టీయూ కళాశాలలో నిర్వహించే ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలను గురువారం డీసీపీ వైభవ్ గైక్వాడ్ పరిశీలించారు. కళాశాలకు వచ్చిన సందర్భంగా డీసీపీకి ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కళాశాల ఆవరణలో కౌంటింగ్ కేంద్రం కోసం ఏర్పాటు చేసిన బ్లాక్–2ను సందర్శించారు. స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ హాళ్లను పరిశీలించి భద్రతపై పలు సూచనలు చేశారు. డీసీపీ వెంట ఏసీపీ తుల శ్రీనివాస్‌రావు, సీఐ సతీశ్, ఎస్సై రవిప్రసాద్ తదితరులు ఉన్నారు.

జిజ్ఞాస ప్రాజెక్టుపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గురువారం జిజ్ఞాస ప్రాజెక్టు నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులంతా స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో పెద్దపల్లి కళాశాలకు గుర్తింపు తీసుకురావాలని ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య కోరారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ అర్జున్, నితిన్, కెప్టెన్ సంజీవ్, శ్రీనివాస్, రవీందర్‌రావు, రామకృష్ణ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ లక్కీ డ్రా


మంథని: దసరా పండుగ సందర్భంగా ఈనెల 21 నుంచి 23, 28 నుంచి 30 తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి రూ.11 లక్షల విలువైన బహుమతులు అందించనున్నట్లు మంథని డిపో మేనేజర్ రాజశేఖరం తెలిపారు. ప్రయాణికులు టికెట్ వెనుక పేరు, ఫోన్ నంబర్ రాసి ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లో టికెట్లు వేయాలని సూచించారు. డ్రాలో గెలుపొందిన వారికి ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 040-69440000, 73828 46352 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు



ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించే జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్తాల రవీందర్, ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ దాసరి రమేశ్ తెలిపారు. అండర్–14, 17 విభాగంలో జోనల్‌స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు అమిరిశెట్టి తిరుపతి, కుమార్, కిశోర్ ఉన్నారు.



ఆ టికెట్ హాట్‌గురూ..!

- పెద్దపల్లి బీజేపీ టికెట్‌కు ఫుల్ డిమాండ్
- పక్క నియోజకవర్గాల్లో పోటీ నిల్
- జిల్లా బీజేపీలో వింత పరిస్థితి

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి నియోజకవర్గం బీజేపీ టికెట్ కోసం ఆశావహులు పోటీపడుతున్నారు. ఆ నియోజకవర్గం నుంచి పోటీ చేసేది మేమంటే.. మేమంటూ అభ్యర్థులు ప్రచారం హోరెత్తిస్తున్నారు. కాగా ప్రత్యర్థి పార్టీలను దీటుగా ఎదుర్కొనే అభ్యర్థులను బరిలో దించాలని అధిష్టానం ఆలోచిస్తున్నట్లు ముఖ్యనేతలు పేర్కొంటున్నారు. బీజేపీలో కొన్నిరోజులుగా పనిచేస్తున్న వారితో పాటు పార్టీలో అధికారికంగా చేరనివారు సైతం ముఖ్యనేతలను కలుస్తూ, తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. బీజేపీ అధిష్టానం ఎమ్మెల్యే ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, స్క్రూటినీ, అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ఎలాంటి ప్రక్రియ షురూ చేయకముందే కొందరు నేతలు తమకే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. అయితే రామగుండం, మంథనిలో బీజేపీ అభ్యర్థులే లేకపోగా, పెద్దపల్లి టికెట్ కోసం పోటాపోటీగా నేతలు పోటీపడటం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

మూడు నియోజకవర్గాల నుంచి 40 దరఖాస్తులు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరుపున పోటీ చేసేందుకు అధిష్టానం దరఖాస్తులు స్వీకరించింది. బీజేపీ నేతలే కాకుండా ఇతర పార్టీల్లో ఉన్న నేతలు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు దరఖాస్తు చేసుకున్నారు. పెద్దపల్లి నియోజకవర్గం నుంచి 13మంది, రామగుండం నుంచి 20, మంథని నుంచి ఏడుగురు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఎటువంటి రుసుం లేకుండానే దరఖాస్తుకు అవకాశం ఇవ్వడంతోనే సీరియస్‌నెస్ లేని అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి.

పెద్దపల్లికి ఫుల్‌డిమాండ్

పెద్దపల్లి నియోజకవర్గంలో బీజేపీ తరుపున పోటీ చేసేందుకు మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు మీస అర్జున్‌రావు, ఎర్ర శేఖర్‌యాదవ్, ఎగోళపు సదయ్యగౌడ్ తదితరులు టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరితో పాటు ఇటీవల బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన నల్ల మనోహర్‌రెడ్డి బీజేపీ టిక్కెట్‌కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ బీజేపీ చేరికల కమిటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్ ద్వారా టికెట్ కోసం తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు టిక్కెట్ ఖరారు చేస్తే పార్టీ కండువా కప్పుకుంటామని అధిష్టానం పెద్దలను కలుస్తున్నారు. తమకు పార్టీ పెద్దలు టిక్కెట్ ఖరారు చేస్తారని, ఈసారి కమలం తరుపున బరిలో నిలిచేది తామే అంటూ తమ అనుచరులతో ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో టిక్కెట్ ఎవరికి వరించనున్నదోనని పార్టీ శ్రేణుల్లో ఆసక్తిని రేపుతుంది.

అక్కడ పోటీ నిల్..

జిల్లాలోని రామగుండం నియోజకవర్గంలో సోమారపు సత్యనారయణ పార్టీకి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని ప్రకటించటంతో ఎమ్మెల్యే అభ్యర్థి స్థానం ఖాళీ ఏర్పడింది. తాజాగా బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసిన పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మంథని నుంచి టిక్కెట్ కోసం పోటీపడిన అభ్యర్థుల్లో ఒకరైన రేండ్ల సనత్‌కుమార్ తాజాగా కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరేందుకు జెడ్పీ చైర్మన్‌ను కలిశారు. దీంతో మంథని నుంచి సునీల్‌రెడ్డికి లైన్‌క్లియర్ అయ్యింది.

ఆయుధాలు అప్పగించాల్సిందే

- ఎన్నికల కోడ్‌తో లైసెన్స్‌డ్ వెపన్స్ స్వాధీనం
- ఇప్పటికే పలు ఆయుధాల డిపాజిట్

రామగుండం కమిషనరేట్‌లో	: 35 పర్సనల్ ఆయుధాలు
పెద్దపల్లి జిల్లా	: 29
డిపాజిట్	: 16
మంచిర్యాల	: 06
డిపాజిట్	: 02



ఆయుధాలు(ఫైల్)

గోదావరిఖని(రామగుండం): ఎన్నికల కోడ్ కూసిన నేపథ్యంలో లైసెన్స్ ఆయుధాలపై పోలీసు శాఖ దృష్టి సారించింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలో లైసెన్స్‌డ్ ఆయుధాలు కలిగి ఉన్న ఆయా వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. కమిషనరేట్‌లోని 35 పర్సనల్ లైసెన్స్‌డ్ వెపన్స్ ఉండగా, అందులో 18 ఇప్పటికే డిపాజిట్ చేశారు. ఇంకా 17 అప్పగించాల్సి ఉంది. ఎన్నికల నిబంధనలో ముందస్తు చర్యగా డిపాజిట్ ప్రక్రియ కొనసాగుతుంది. ఆయుధాలు కలిగిఉన్న ప్రతిఒక్కరు సాధ్యమైనంత త్వరగా ఆయా పోలీస్‌స్టేషన్లలో అప్పగించాలిందేనని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల ప్రచారం ప్రారంభం కావడంతో పోలీసు శాఖ ప్రతీ అంశాన్ని సునిశితంగా పరిశీలిస్తోంది. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ప్రధానంగా లైసెన్స్ ఆయుధాల విషయంలో స్పష్టంగా వ్యవహరిస్తోంది. ఎవరివద్ద వ్యక్తిగత వెపన్స్ ఉండటానికి వీల్లేదని నోటీసులు జారీ చేసింది. అంతే కాకుండా నోటీసు అందిన వెంటనే పోలీస్‌స్టేషన్లలో అప్పగించాలని అల్టిమేటం జారీ చేసింది.

వెపన్స్ డిపాజిట్ చేయాలి



లైసెన్స్ వెపన్స్ ఉన్న వారు వెంటనే డిపాజిట్ చేయాలి. ఎన్నికల కోడ్ మొదలైన నేపథ్యంలో ఎవరివద్ద ఉండటానికి వీల్లేదు. ముందస్తు చర్యల్లో భాగంగా వెపన్ డిపాజిట్ కొనసాగుతోంది. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం తిరిగి తీసుకునే వీలుంటుంది. సకాలంలో అప్పగించకుండా తనిఖీల్లో పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవు.

– రెమా రాజేశ్వరి, సీపీ, రామగుండం

పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్‌కు తప్పిన ప్రమాదం



డివైడర్‌ను ఢీకొట్టిన అడిషనల్ కలెక్టర్ వాహనం

కొండపాక(గజ్వేల్)/పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్ విజయ శ్యాంప్రసాద్‌లాల్‌కు త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్న కిష్టాపూర్ క్రాస్ రోడ్డు వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ పుష్పరాజ్ కథనం ప్రకారం.. అడిషనల్ కలెక్టర్ విజయ శ్యాంప్రసాద్‌లాల్ హైదరాబాద్ నుంచి రామగుండం వైపునకు ప్రభుత్వ వాహనంలో బయలుదేరారు. వారి వాహనానికి ముందు వెళ్తున్న ఒక కారు రాజీవ్ రహదారిపై ఉన్న చిన్నికిష్టాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద ఒక్కసారిగా తిరిగింది. దీంతో అడిషనల్ కలెక్టర్ వాహన డ్రైవర్ దానిని తప్పించబోయి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను, విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో వాహనం ముందు భాగం దెబ్బతింది. ఎవరికీ ఏ ప్రమాదం జరగక పోవడంతో పెను ప్రమాదం తప్పినట్టయింది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎన్టీపీసీ ఉద్యోగులకు పీఆర్‌పీ పెంపు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ ఉద్యోగులకు పీఆర్‌పీ(పర్ఫామెన్స్ రిలేటెడ్ పే) పెంపుదల చేస్తున్నట్లు గురువారం రాత్రి సంస్థ ఉద్యోగులకు సమాచారం అందింది. ఉద్యోగుల కేటగిరీలను బట్టి గతేడాది కంటే 10 నుంచి 15 శాతం వరకు పెంపుదల జరిగినట్లు సమాచారం. ఎన్టీపీసీ నికర లాభం వృద్ధి చెందడంతో ఉద్యోగులకు పీఆర్‌పీ చెల్లింపు వివరాలను వెల్లడించారు. పీఆర్‌పీకి సంబంధించిన డబ్బులు ఉద్యోగుల ఖాతాల్లో వారం రోజుల్లో జమ కానున్నాయి. ఈసందర్భంగా పీఆర్‌పీ ప్రకటనపై ఉద్యోగులు సంతృప్తి వ్యక్తం చేశారు.

16 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

పెద్దపల్లిరూరల్: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ఈ నెల 16నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. పెద్దపల్లిలోని జెడ్పీ బాలుర పాఠశాలలో టెన్త్ పరీక్షలకు 184 మంది, బాలికోన్నత పాఠశాలలో ఇంటర్ పరీక్షలకు 322 మంది హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆయా అధ్యయన కేంద్రాల నుంచి హాల్‌టికెట్లు పొందాలని సూచించారు.

బీఆర్‌ఎస్ ఇన్‌చార్జీల నియామకం

- ప్రచార జోరు పెంచిన కారు



రవీందర్ సింగ్



నారదాసు లక్ష్మణ్‌రావు



ఈద శంకర్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్‌ఎస్ దూసుకుపోతోంది. గులాబీ బాస్ సీఎం కేసీఆర్ ముందే అభ్యర్థులను ప్రకటించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో సీఎం కేసీఆర్ పాల్గొనే భారీ బహిరంగ సభల షెడ్యూల్ విడుదలైంది. తాజాగా నియోజకవర్గాల వారీగా పార్టీ తరపున ఇన్‌చార్జిల నియమించారు. ఇతర పార్టీలు టిక్కెట్లు ఖరారు చేయడంలో తర్జనభర్జన పడుతుంటే.. గులాబీ పార్టీ ఈ నెల 15న అభ్యర్థులకు బీఫాంలను అందజేయనుంది. బీఆర్‌ఎస్ అధినేత రాష్ట్ర వ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేయనున్నారు. ఇలా అన్ని విషయాల్లో ప్రత్యర్థి పార్టీలకు అందుకోలేనంత స్పీడ్‌గా ప్రచారంలో కారు జోరు పెంచింది.

గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం..

అసెంబ్లీ ఎన్నికలకు నెలల సమయమున్నా సీఎం కేసీఆర్ ముందే అభ్యర్థులను ప్రకటించటంతో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అభ్యర్థిత్వం ఖరారైన మరుసటి రోజు నుంచే వారు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ గెలుపు వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ తమను మరోసారి గెలిపించాలని కోరుతున్నారు. పార్టీ శ్రేణులకు, అభ్యర్థులకు మధ్య గ్యాప్ లేకుండా జిల్లాలోని 7 నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించారు.

బీఆర్‌ఎస్ అసెంబ్లీ ఇన్‌చార్జిలు వీరే..

చొప్పదండి : గంగుల కమలాకర్
వేములవాడ : బి.వినోద్‌కుమార్
మానుకొండూర్ : జీవీ రామకృష్ణారావు
పెద్దపల్లి : రవీందర్‌సింగ్
మంథని: ఈద శంకర్‌రెడ్డి
రామగుండం: నారాదాసు లక్ష్మణరావు
జగిత్యాల: ఎల్.రమణ, రాజేశంగౌడ్

జంప్ జిలానీ

నిన్న కాంగ్రెస్.. నేడు బీఆర్‌ఎస్



కాంగ్రెస్ కండువా కప్పుతున్న రాజ్‌ఠాగూర్



గులాబీ కండువా కప్పిన ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని(రామగుండం): జిల్లాలో ఎన్నికల కోలాహలం పెరిగింది. ఆశావహులు చిన్న అవకాశాన్ని కూడా తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. ఈక్రమంలో గోదావరిఖనిలో స్థానిక 43వ డివిజన్‌కు చెందిన బొల్లు శ్రీనివాస్ బుధవారం ఎమ్మెస్ రాజ్‌ఠాగూర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా, గురువారం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గులాబీ కండువా కప్పి సొంతగూటికి ఆహ్వానించారు. ఇలా జంప్ జిలానీలతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

ప్రతీ గడపకు కేసీఆర్ సంక్షేమ పథకాలు

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

జంగ్ తెలంగాణ



ఎమ్మెల్యే చందర్‌కు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

గోదావరిఖని(రామగుండం): సీఎం కేసీఆర్ పాలనలో ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందుబాటులోకి వచ్చాయని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. గురువారం 42వ డివిజన్‌లో చేపట్టిన ప్రజా అంకితయాత్రలో మాట్లాడారు. స్వరాష్ట్రం పదేళ్లలో వందేళ్ల అభివృద్ధి సాధించి అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించి మంత్రి కేటీఆర్‌కు బహుమతిగా ఇద్దామన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు రానివారు కేవలం ఎన్నికలప్పుడే వచ్చి కల్లిబొల్లి మాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారని, అలాంటివారిని నమ్మవద్దన్నారు. నిత్యం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, రాష్ట్ర నాయకురాలు మూల విజయారెడ్డి, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, నాయకులు ఆడెపు శంకర్, పిల్లి రమేశ్, మెతుకు దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన ఆటోయూనియన్ మాజీ ప్రెసిడెంట్ దండె మహేందర్, డ్రైవర్లు 13వ డివిజన్ కార్పొరేటర్ రాకం లత ఆధ్వర్యంలో, 43వ డివిజన్‌కు చెందిన బొల్లు శ్రీనివాస్ కార్పొరేటర్ మెతుకు దేవరాజ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రామగుండం నియోజకవర్గ పార్టీ ప్రచార కార్యదర్శిగా సొక్కుల ప్రవీణ్‌కుమార్‌ను ఎమ్మెల్యే నియమించారు.

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ రావాల్సిందే

- డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజ్‌ఠాగూర్



ప్రజాదీవెన యాత్రలో రాజ్‌ఠాగూర్ తదితరులు

గోదావరిఖని(రామగుండం): దగాపడిన తెలంగాణ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిందేనని డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజ్‌ఠాగూర్ పిలుపునిచ్చారు. ప్రజాదీవెన యాత్రలో భాగంగా గురువారం గోదావరిఖనిలోని పలు డివిజన్లలో పర్యటించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, పదవిలో ఉన్నా లేకున్నా 30 ఏళ్లుగా ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందిస్తూనే ఉన్నానని పేర్కొన్నారు. రామగుండం ప్రాంతం పూర్తి స్థాయిలో అభివృద్ధి పర్చేందుకు కాంగ్రెస్ పార్టీ కృతనిశ్చయంతో ఉందన్నారు. ఆరు గ్యారెంటీ కార్డుల ద్వారా ప్రజలకు మరింత చేరువవుతోందని వివరించారు. బీఆర్‌ఎస్ పథకాలు నోటిమాటలకే పరిమితం అయ్యాయని, ఏ ఒక్క పథకం ప్రజలకు చేరలేదన్నారు. ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, సింగరేణి ఓసీపీల్లో యువతకు ఉద్యోగాలిప్పిస్తామని మోసం చేశారన్నారు. ఈప్రాంత వనరులు దోచుకునేందుకు మరోసారి అధికారంలోకి రావాలని మీవద్దకు వస్తున్న బీఆర్‌ఎస్ నాయకులను నమ్మవద్దన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు పెండ్యాల మహేశ్, ముస్తాఫా, పల్లికొండ రాజేశ్, మేకల పోశం, మేడి ఓదెలు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దయ్యాక ఏమవుతారమ్మా..?

- విద్యార్థులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాటామంతి



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మంథని: మండలంలోని కాకర్లపల్లి ప్రాథమిక పాఠశాలను గురువారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక రెవెన్యూ, ఇతర శాఖల అధికారులకు ఏలాంటి సమాచారం లేకుండానే పాఠశాలకు చేరుకున్నారు. విద్యార్థులకు అందుతున్న అల్పాహార నాణ్యతను పరిశీలించి వారితో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. పెద్దయ్యాక ఏమవుతారని విద్యార్థులను అడుగగా ఒకరు సొంతంగా కంపెనీ ఏర్పాటు చేస్తానని, మరొకరు కంప్యూటర్ ఇంజినీర్ అవుతానని సమాధానం చెప్పారు. విద్యార్థుల ఉన్నత ఆశయాలపై కలెక్టర్ అభినందించారు. రోజూ పాఠశాలలోనే అల్పాహారం, మధ్యాహ్న భోజనం చేయాలని, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రతీ విద్యార్థిపై శ్రద్ధ వహించాలని, విద్యా ప్రమాణాలు మెరుగుపర్చడానికి కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మాధవి, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.



దాండియా సందడి

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం సింధూర కళాశాల సమీపంలోని బచపన్ అకాడమీ హైట్స్‌లో గురువారం రాత్రి ముందుస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా చిన్నా, పెద్ద తేడా లేకుండా దాండియా ఆటలతో సందడి చేశారు.

క్లుప్తంగా

నగదు పట్టివేత

రామగిరి(మంథని): ఎన్నికల నియమావళిలో భాగంగా మండల పరిధిలోని పన్నూర్ క్రాస్ రోడ్ వద్ద ఎస్సై రవిప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. నాగెపల్లి గ్రామానికి ఓ వ్యక్తి వద్ద లక్ష రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని, ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎన్టీపీసీ పరిధిలో..

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు చోట్ల తనిఖీల్లో వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జీవన్ తెలిపారు. ఈనెల 10న బీ పవర్‌హౌజ్ గడ్డ వద్ద రూ.18,18,471 విలువ గల 27 కిలోల 541గ్రాముల వెండి ఆభరణాలను మంచిర్యాలకు చెందిన ఆనంద్ జవార్ నుంచి స్వాధీనం చేసుకొని ఫ్లయింగ్ స్క్వాడ్ టీం(ఎఫ్ఎస్‌టీ)కు అందించామని పేర్కొన్నారు. 11న మేడిపల్లి సెంటర్‌లో యైటింక్లయిన్ కాలనీకి చెందిన ధర్ని రాజయ్య వద్ద రూ.1,50,000, గురువారం పెద్దంపేటకు చెందిన బండి రాములు నుంచి రూ.2 లక్షల పది వేలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

నలుగురి బైండోవర్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో నలుగురిని గురువారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. గంజాయి కేసులో గతంలో ప్రమేయం ఉన్న దివాకర్, ఎన్నికల కేసులో ప్రమేయం ఉన్న సతీశ్, శ్రీనివాస్, మల్లేశ్‌ను బైండోవర్ చేసినట్లు ఎన్టీపీసీ ఎస్సై జీవన్ తెలిపారు.

తాగిన మైకంలో యువకుడి ఆత్మహత్య


అమరేందర్‌రెడ్డి (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): ధర్మారం మండలం ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన బద్దం అమరేందర్‌రెడ్డి (30) తాగిన మత్తులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సత్యనారాయణ వివరాల ప్రకారం.. అమరేందర్‌రెడ్డి నిత్యం మద్యం సేవిస్తూ ఎలాంటి పనులు చేయకుండా తిరిగేవాడు. గురువారం ఉదయం తాగిన మైకంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య దివ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అవకాశమివ్వండి


ఈటల రాజేందర్‌కు విన్నవిస్తున్న దేవేందర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బద్రి దేవేందర్ కోరారు. గురువారం బీజేపీ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌ను కలిసి విన్నవించినట్లు తెలిపారు. యువతకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు.

ముగ్గురు బాలికలపై వృద్ధుడి లైంగికదాడి

- మూడు నెలలుగా అకృత్యం
- జగిత్యాల జిల్లా గొల్లపల్లిలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి
- పోలీసుల అదుపులో నిందితుడు..?

గొల్లపల్లి: ముగ్గురు బాలికలపై ఓ వృద్ధుడు మూడు నెలలుగా లైంగికదాడికి పాల్పడుతున్న ఘటన మండలంలోని తిర్మలాపూర్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. తాత అని పిలిచిన వారికి డబ్బు ఆశ చూపి.. మాయమాటలు చెప్పి ఈ అకృత్యానికి ఒడిగడుతున్నాడు. పిల్లల ఆరోగ్యం బాగలేకపోవడంతో వారి తల్లులు మందలించగా.. అసలు విషయం బయటపడింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముగ్గురు బాలికలు రంగధాముని పల్లి ప్రాథమిక పాఠశాలలో ఒకరు ఐదు, మరొకరు నాలుగు, ఇంకొకరు మూడో తరగతి చదువుతున్నారు. ముగ్గురి తండ్రులు ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లారు. తల్లులు కూలి పనిచేస్తూ వీరిని పోషించుకుంటున్నారు. వీరి సామాజికవర్గానికే చెందిన శివరాత్రి ముత్తయ్య (65) వీరి ఇంటి సమీపంలో ఉంటాడు. పిల్లలకు సెలవు రోజు ఇంటికి పిలిచి డబ్బులు ఇవ్వడంతోపాటు పొలం వద్దకు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడుతున్నాడు. ఇలా మూడునెలలుగా తన కామవాంఛ తీర్చుకుంటున్నాడు. ఈ క్రమంలో చిన్నారులు నాలుగురోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యారు. తల్లులు ఆరా తీయగా జరిగిన విషయాన్ని వారితో చెప్పారు. సదరు కామాంధుడిని కుల సంఘంలోకి పిలిస్తే రాకపోగా.. బెదిరింపులకు పాల్పడినట్లు బాధితుల తల్లులు అంటున్నారు. దీంతో చేసేది లేక వారు గొల్లపల్లి పోలీసులను ఆశ్రయించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు.

అడిగితే బెదిరింపులు

తమ పిల్లలకు జరిగిన అన్యాయంపై సంఘం దృష్టికి తీసుకెళ్లగా.. కుల పెద్దలు పిలిచినా ముత్తయ్య రాలేదని, పైగా ఆయన భార్య మల్లవ్వ, కొడుకు శ్రీనివాస్ తమనే బెదిరిస్తున్నారని బాధితులు ఆరోపించారు.

ఉరి తీయాలి

తమ పిల్లల జీవితాలను నాశనం చేసిన ముత్తయ్యను ఉరితీయాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు స్పందించి నిందితుడితోపాటు ఆయన భార్య మల్లవ్వ, కొడుకు శ్రీనివాస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కుల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. సదరు నిందితుడిని ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

సీఎం కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడం అదృష్టం

- జెడ్పీ చైర్మన్ పుట్ట మధు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న జెడ్పీ చైర్మన్ మధు

మంథని: భవిష్యత్ తరాల గురించి ఆలోచించే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో పని చేయడం అదృష్టమని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. గురువారం మహాముత్తారం మండలానికి చెందిన సుమారు 30మంది యూత్ సభ్యులు బీఆర్ఎస్‌లో చేరగా, పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నేటి యువత గొప్పగా ఆలోచన చేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే బాధ్యత తీసుకోవాలని అన్నారు. 40 ఏళ్లలో జరగని అభివృద్ధిని నాలుగేళ్లలో చేసి చూపించామని, వాస్తవ విషయాలను తెలుసుకుని ప్రజల్లో చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్‌లో యువతకు ప్రాధాన్యత ఉంటుందని, పార్టీ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో మహాముత్తారం యూత్ సభ్యులు పంగ సురేశ్, పంగ దేవేందర్, కొయ్యాల మహేందర్, మంథెన లవకుమార్, మంథెన రాజబాపు, రామిల్ల వంశీ తదితరులు ఉన్నారు.

పెద్దంపేటలో అక్రమాలపై చర్యలేవి?


మాట్లాడుతున్న సిటిజన్ రైట్స్ ప్రతినిధులు

రామగుండం: అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామ పంచాయతీలో రూ.90 లక్షల నిధుల అక్రమాలు జరిగినట్లు గతంలోనే ఆధారాలతో జిల్లా కలెక్టర్, డీపీఓ, డీఎల్‌పీఓలకు అప్పగించడం జరిగిందని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ప్రతినిధులు మేర్గు నరేశ్‌గౌడ్, పల్లె శ్రీనివాస్, పైడిపల్లి వెంకటస్వామిగౌడ్, వేగోళపు వెంకటస్వామిగౌడ్ ఆరోపించారు. గురువారం వారు మాట్లాడుతూ, అధికారుల బృందం గ్రామ పంచాయతీలో విచారణ చేపట్టి రికార్డులను సీజ్ చేసి పరిశీలనకు తీసుకువెళ్లడం జరిగిందన్నారు. అనంతరం రూ.22.21 లక్షలు దుర్వినియోగం జరిగినట్లు గుర్తించి కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ప్రతినిధులకు తెలుపగా, అధికారులు నెల రోజుల తర్వాత కేవలం రూ.2.48 లక్షలు మాత్రమే నిధుల దుర్వినియోగం జరిగినట్లు మరోసారి ప్రకటించారని తెలిపారు. పలుమార్లు అధికారుల తప్పుడు ప్రకటనలపై తమకు అనుమానాలున్నాయని, పక్షం రోజులైనా పంచాయతీ పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు ఎందుకు చేపట్టడం లేదని సిటిజన్ రైట్స్ ప్రతినిధులు ప్రశ్నించారు. నిధుల దుర్వినియోగంపై సంబంధిత ఉన్నతాధికారులు సత్వరమే ప్రజల సమక్షంలో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

నత్తనడకన 'అమృత్ భారత్' పనులు


రైల్వేస్టేషన్ ప్రాంగణంలో నిర్మాణ మెటీరియల్

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ పథకంలో గుర్తించి ఆగస్టు 6న అభివృద్ధి పనులను వర్చువల్ పద్ధతిలో ప్రధాని మోదీ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రెండు మాసాలు గడిచినా పనులు పదిశాతం కూడా పూర్తి కాకపోవడంతో అధికారుల పని తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా పనుల్లో భాగంగా వేయిటింగ్ హాల్, పబ్లిక్ టాయిలెట్స్ కూల్చివేశారు. వాహనాలకు అడ్డుగా నిర్మాణ మెటీరియల్‌తో అసౌకర్యంగా ఉంది. ఈ క్రమంలో రోజూ వేలాది మంది ప్రయాణికులు రామగుండం రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తుండగా వారికి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం పట్ల రైల్వేస్టేషన్ మాస్టర్‌కు రోజూ ఫిర్యాదు చేస్తున్నారు. ముఖ్యంగా ఎస్కలేటర్, పార్కింగ్ స్టాండు, పబ్లిక్ టాయిలెట్స్ ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. మరో రెండు రోజుల్లో దసరా పండుగ పురస్కరించుకొని ప్రయాణికుల రద్దీ పెరగనుండడంతో కనీసం టాయిలెట్స్, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సపాయి పనిలో పనిముట్లు వినియోగించాలి


కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

కోల్‌సిటీ(రామగుండం): నగర పరిశుభ్రత కోసం పని చేసే సపాయి కార్మికులు పనిలో భద్రత, రక్షణ పనిముట్లను ఉపయోగించాలని, అవే కార్మికులకు శ్రీరామరక్ష అని ఢిల్లీ నుంచి వచ్చిన జాతీయ సపాయి కర్మచారీస్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ) ప్రతినిధులు మనోహర్ కృష్ణ, చిన్నికృష్ణ పిలుపునిచ్చారు. గురువారం రామగుండం నగరపాలక కార్యాలయంలో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పారిశుధ్య కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావుతో కలిసి కార్మికులకు ప్రాజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. మురుగుకాల్వలు, మ్యాన్‌హోళ్లను శుభ్రం చేసే సందర్భాల్లో ఆధునిక పరికరాలు ఉపయోగించాలని సూచించారు. చేతులకు తొడుగులు, కాళ్లకు బూట్లు, పీపీఈ కిట్లు ధరించాలని కోరారు. ఇవేవి ధరించకుండా నిర్లక్ష్యంతో మురుగుకాల్వల్లోకి దిగి పని చేయడం ద్వారా అనేకరకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యాంసుందర్, సునీల్, నాగభూషణం, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ మధుకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'శ్రమ దోపిడీ చేస్తున్న ఆర్ఎఫ్‌సీఎల్'

గోదావరిఖని(రామగుండం): ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం కార్మికులను చర్లపల్లి జైలులాగా నిర్బంధించి శ్రమ దోపిడీకి గురి చేస్తోందని ఆర్ఎఫ్‌సీఎల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు అంబటి నరేశ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. కనీసవేతనాలు పెంచకుండా కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని, కెమికల్ వాసనతో కార్మికులు రోగాల బారిన పడుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు కూడా సిద్ధమని హెచ్చరించారు. సమావేశంలో అశోక్, గోలి ప్రకాశ్, నిమ్మల రవి, అమిరిశెట్టి శ్రీకాంత్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం


సతీశ్(ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకున్న ఓ యువకుడు, తన నేత్రాలను దానం చేసి ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించాడు. వివరాలు.. ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేసే వంగరి సతీశ్(39) స్థానిక మారుతీనగర్‌లో భార్య, పిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి నేత్రాలను దానం చేయడానికి భార్య సుమలత, తల్లిదండ్రులు రాజయ్య, రాజేశ్వరి, సోదరులు సురేశ్, రాజేశ్ ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి వాసు, టెక్నీషియన్ ఎండీ ఆరిఫ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు. ఆత్మీయున్ని కోల్పోయిన దుఃఖంలో కూడా మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించడానికి సతీశ్ నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు టి.శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సీహెచ్.లింగమూర్తి, రాజమౌళి, నూక రమేశ్, జిల్లా అధ్యక్షుడు భీష్మాచారి, కేఎస్.వాసు, అన్నపూర్ణ, రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి అభినందించారు. కార్యక్రమంలో మామిడాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి ఉద్యోగి దుర్మరణం


రాకేశ్‌పటేల్ మృతదేహం

రామగుండం: బసంత్‌నగర్ రైల్వే వంతెన వద్ద లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు సింగరేణి ఉద్యోగి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. శ్రీరాంపూర్ 1కే-1ఏలో బదిలీ వర్కర్‌గా పని చేస్తున్న చాతకొళ్ల రాకేశ్‌పటేల్ గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై కరీంనగర్ నుంచి గోదావరిఖని వైపు వస్తుండగా లారీ ఢీకొనడంతో మృతిచెందాడు. ప్రధాన రహదారిపై జరిగిన ఈ ఘటనతో ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడతామని ఎస్సై పేర్కొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

అన్ని సంఘాలకు ప్రాధాన్యం ఇవ్వాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణిలో నిర్వహిస్తున్న కమిటీల సమావేశాలకు అన్ని కార్మిక సంఘాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని ఏఐటీయూసీ కేంద్ర కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజారత్నం అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ, సింగరేణిలో ఎన్నికలు నిర్వహించాలని కోరిన సంఘాలు ఇప్పుడు వద్దని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, ఎన్నికలు వాయిదా పడటానికి ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంతో పాటు కొన్ని కార్మిక సంఘాలు కారణమని ఆరోపించారు. యాజమాన్యం నిర్వహిస్తున్న సేఫ్టీ, మైన్స్, జనరల్ తదితర కమిటీల సమావేశాలకు కొన్ని సంఘాలను మాత్రమే ఆహ్వానించడాన్ని తప్పుబట్టారు. కోర్టు తీర్పు ప్రకారం డిసెంబర్ 27న ఎన్నికలను నిర్వహించాలని కోరారు. లేకుంటే యాజమాన్యంపై పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐటీయూసీ సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ ఎల్.ప్రకాశ్, గోవర్ధన్, అన్నారావు, రవీందర్, తిరుపతి, రవికుమార్, రాజయ్య, గట్టయ్య, అశోక్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి, రవాణా పెంచాలి

- సింగరేణి డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డైరెక్టర్లు

గోదావరిఖని(రామగుండం): వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. గురువారం ఆర్జీ-1 ఏరియా కాన్ఫరెన్స్‌హాల్ నుంచి అన్ని ఏరియాల జీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓసీపీల్లో బొగ్గు, ఓబీ వెలికితీతపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. నిర్దేశించిన ఉత్పత్తి సాధించేందుకు చేపట్టాల్సిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. భూగర్భగనుల్లో వినియోగం, ఉత్పత్తి పెంపుపై ఆరాతీశారు. కాన్ఫరెన్స్‌లో ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ రామ్మూర్తి, ఏజెంట్ బాణోతు సైదులు, చిలక శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.చంద్రశేఖర్, ఏజీఎం(ఐఈడీ)ఆంజనేయులు, సీఎస్పీ ఎస్ఈ దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఒత్తిడితోనే ఎన్నికలకు వెనకడుగు


సమావేశంలో నాయకులు

రామగిరి(మంథని): రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడితోనే సింగరేణి యాజమాన్యం ఎన్నికలకు వెనకడుగు వేసిందని ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ జూపాక రాంచందర్, బ్రాంచ్ సెక్రెటరీ ఎంఆర్‌సీ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో మాట్లాడారు. కార్మికులపై పెరుగుతున్న పని భారాన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ పక్షాన కోర్టుకు వెళ్లడం జరిగిందన్నారు. కోర్టు కూడా ఎన్నికలు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసినా ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి ఎన్నికలు నిర్వహణకు యాజమాన్యం ముందుకు రావడం లేదన్న విషయాన్ని కార్మికులు గ్రహిస్తున్నారని తెలిపారు. గుర్తింపు సంఘంతో కార్మికులకు ఒరిగేది ఏమి లేదని కార్మికుల సంక్షేమం ఏఐటీయూసీతోనే సాధ్యమన్నారు. సమావేశంలో నాయకులు డీటీ రావు, రవికుమార్, సమ్మయ్య, మద్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేత

గోదావరిఖని(రామగుండం): ఆర్జీ-1 ఏరియా జీవీటీసీలో ఐటీఐ ట్రేడ్ అప్రెంటిషిప్ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. 32 మంది అంతర్గత అభ్యర్థులు, 37 మంది బహిర్గత అభ్యర్థులు మెత్తం 69 మందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సర్టిఫికెట్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగ అవకాశం పొందుటకు ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రామ్మోహన్, మేనేజర్ దినేశ్‌కుమార్, డీవైఎస్ఈ వేణుగోపాల్, డీజీఎం సత్యనారాయణ, సుజిత్ పాల్గొన్నారు.

రెస్క్యూ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

గోదావరిఖని(రామగుండం): సింగరేణి గనుల్లో ప్రమాదాలు జరిగిన సమయంలో అండగా నిలుస్తోన్న రెస్క్యూ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి కోరారు. ఈసందర్భంగా గురువారం రెస్క్యూ సిబ్బందిని కలిసి సమస్యలు తెలుసుకున్నారు. సిబ్బందికి ప్రత్యేక అలవెన్స్‌లు, ప్రతి కనబర్చిన వారికి ప్రయోజనం చేకూర్చాలన్నారు. ఆయన వెంట ఆర్జీ-2 ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

జీడీకే-7ఎల్ఈపీ గని పరిశీలన

గోదావరిఖని(రామగుండం): ఆలిండియా మైన్స్ రెస్క్యూ పోటీల ప్రాక్టికల్స్ ఆర్జీ-2 ఏరియా జీడీకే-7 ఎల్ఈపీ గనిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈసందర్భంగా డీఎంఆర్ఎస్ ధన్‌బాద్, డీఎంఎస్ అడీఎంఎస్ అధికారులు గురువారం జీడీకే-7 గనిలోకి దిగి ఏర్పాట్లు పరిశీలించారు. పోటీలకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా 28 జట్లు పాల్గొంటున్న ఈపోటీలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సింగరేణి అధికారులకు సూచించారు.

లారీ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు


సుశీలను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధి గౌతమినగర్ రైల్వే గేట్ వద్ద గురువారం మెండే సుశీలను లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాలు.. సుశీల, ఆమె భర్త మెండే సంతోష్ గురువారం గోదావరిఖని నుంచి గౌతమినగర్ మీదుగా పెంచికలపేటకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. లారీ టైర్ కింద పడడంతో సుశీల కుడిచేయి, నడుముకు తీవ్రగాయాలు కాగా, స్థానికులు 108 అంబులెన్స్‌లో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఎన్టీపీసీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీవన్ పేర్కొన్నారు.

కత్తిపోట్ల కలకలం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు

గోదావరిఖని(రామగుండం): స్థానిక ప్రధాన చౌరస్తా వద్ద కత్తిపోట్లు కలకలం రేపింది. గురువారం రాత్రి చౌరస్తా సమీపంలోని గ్లోరిష్ ఫ్లవర్ మర్చంట్ వద్ద గొడవ జరిగింది. స్థానికుల వివరాలు.. ఎంగిలిపూల బతుకమ్మ సామగ్రి విక్రయించుకునేందుకు బల్లలు వేసుకునే విషయంలో గొడవ జరిగి పూలషాప్‌లో ఉన్న కత్తెరతో సతీశ్ అనే వ్యక్తి షాపులో పనిచేస్తున్న తుంగపిండి కార్తీక్, తుంగపిండి అర్జున్‌పై దాడి చేశాడు. దీంతో వారికి కడుపులో, కాళ్లకు గాయాలయ్యాయి. బాధితులు పరుగెత్తుకుని వచ్చి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

సెలవులొచ్చాయ్..






తీరొక్క పూవులతో బతుకమ్మను పేర్చి గౌరమ్మను పెట్టి పూలను పూజించే బతుకమ్మ పండగ సెలవులు రానే వచ్చాయి. ఆడపడుచులందరూ ఒక్కచోట చేరి ఉయ్యాల పాటలతో ఊరూరా జరుపుకునే అపురూప వేడుక బతుకమ్మ. శనివారం 14న చిన్నబతుకమ్మతో మొదలై 22న ఆదివారం సద్దుల బతుకమ్మతో ముగియనుంది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించడంతో గురువారం గురుకులాలలు, మోడల్ స్కూళ్ల నుంచి విద్యార్థులు ఇళ్లకు పయనమయ్యారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి/సుల్తానాబాద్‌రూరల్